క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొత్తూరు: కొత్తూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, చెట్లకొమ్మల తొలగింపు కారణంగా ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ రమేశ్‌గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో కొత్తూరు పారిశ్రామికవాడ, కుమ్మరిగూడ, ఫాతీమాపూర్‌తో పాటు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. ప్రజలు, వ్యాపారులు విద్యుత్ సరఫరాలో అంతరాయానికి సహకరించాలని కోరారు.

మాజీ ఎమ్మెల్యేను కలిసిన నాయకులు



పట్నం నరేందర్‌రెడ్డితో మాజీ సర్పంచ్ గణేశ్‌గౌడ్, నాయకులు

షాబాద్: కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని మండల బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు కలిశారు. లగచర్ల ఘటనలో పెట్టిన అక్రమ కేసుల్లో జైలుకు వెళ్లి బెయిల్‌పై బయటకు వచ్చిన నరేందర్‌రెడ్డిని శనివారం నగరంలోని ఆయన నివాసంలో మండల పరిధిలోని మల్లారెడ్డిగూడ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పరిగి గణేశ్‌గౌడ్, నాయకులు మల్లారెడ్డి, పరిగి శేఖర్‌గౌడ్, వెంకటయ్య, బాల్‌రాజ్, రంగం శ్రీను, శ్రీను, సత్యనారాయణ, కుమార్ ఉన్నారు.

ప్రతీ సోమవారం ప్రజావాణి

షాద్‌నగర్: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీఓ కార్యాలయంలో ప్రతీ సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ సరిత ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు, అర్జీలు, దరఖాస్తులు స్వీకరించి పరిష్కరించేందుకు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతీ సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ కోరారు.

ఇళ్ల సర్వే పక్కాగా నిర్వహించాలి

ఎంపీడీఓ అపర్ణ



ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ అపర్ణ

షాబాద్: ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని, లబ్ధిదారుల వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేసేటప్పుడు ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని ఎంపీడీఓ అపర్ణ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని సంకెపల్లిగూడ గ్రామంలో ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను సర్వేయర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి మొబైల్ యాప్‌లో నమోదుచేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఒక్క దరఖాస్తును వదలకుండా సర్వే చేయాలని ఆదేశించారు. ప్రజలు సర్వే కోసం వచ్చే సిబ్బందికి సహకరించాలని సూచించారు. సర్వే సందర్భంగా క్షేత్రస్థాయిలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, తదితరులు ఉన్నారు.

ఘనంగా స్వయంపాలన



స్వయంపాలనలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మొయినాబాద్‌రూరల్: విద్యార్థుల్లో భయం తొలగిపోయినప్పుడే విద్యతో పాటు విజ్ఞానవంతులుగా ఎదుగుతారని ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు యూ.పోచయ్య అన్నారు. శనివారం మండల పరిధిలోని ఎన్కెపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘన ంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థులు ఒక రోజు ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పోచయ్య మాట్లాడుతూ.. నాలుగు గోడల మధ్యనే విద్య నేర్చుకోవడం కాకుండా బయట ప్రపంచంలో ఏమి జరుగుతుందో తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యావంతులుగా ఎదగాలంటే అన్ని రంగాల్లో పాలుపంచుకోవాలని సూచించారు. విద్యతో పాటు క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. సమావేశంలో హెచ్‌ఎం లక్ష్మారెడ్డి, ఉపాధ్యాయులు కమలమోహన్, రాధ, సంజీవ్‌కుమార్, మల్లేశ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

అధ్వానంగా రోడ్లు.. ప్రయాణికుల పాట్లు

- ఏళ్లుగా మరమ్మతులు చేయకపోవడంతో గుంతలుగా మారిన దారులు
- అవస్థలు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు



కంకరతేలి అధ్వానంగా మారిన చిలుకూరు–మొయినాబాద్ రోడ్డు



అధ్వానంగా సురంగల్–శ్రీరాంనగర్ రోడ్డు

మొయినాబాద్: గ్రామాల రోడ్లు అధ్వానంగా మారాయి. రోడ్లపై పెద్ద పెద్ద గుంతలుపడి, కంకర తేలడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలా ఏళ్లుగా మరమ్మతులకు నోచుకకపోవడంతో గతంలో వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో వాహనదారులకు ఈ రోడ్లపై ప్రయాణం నరకంగా మారింది. కొత్త ప్రభుత్వం వచ్చి ఏడాది దాటినా గ్రామాల రోడ్లకు మోక్షం లభించడం లేదు. గతంలో పలు రోడ్లకు నిధులు మంజూరైన పనులు చేట్టడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.

గుంతలతో అవస్థలు..

మండలంలోని సురంగల్–శ్రీరాంనగర్, కనకమామిడి–వెంకటాపూర్, మొయినాబాద్–చిలుకూరు, పెద్దమంగళారం–చందానగర్, తోలుకట్ట–నక్కలపల్లి, ఎనికేపల్లి–బాకారం, వెంకటాపూర్–నక్కలపల్లి, రెడ్డిపల్లి–చిన్నమంగళారం రోడ్లు అధ్వానంగా మారడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. గత వర్షాకాలంలో రోడ్లపై కంకర తేలి, పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. అప్పటి నుంచి గుంతలకు మరమ్మతులు చేయకపోవడంతో ప్రస్తుతం రోడ్లపై నడవలేని పరిస్థితి నెలకొంది. ఈ రోడ్లపై వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

నిధులు మంజూరైనా మొదలుకాని పనులు

మండలంలోని కొన్ని రోడ్ల అభివృద్ధికి గత ప్రభుత్వ హయాంలోనే నిధులు మంజూరయ్యాయి. కానీ ఆ రోడ్ల పనులు ఇంతవరకు మొదలుకాలేదు. రోడ్ల అభివృద్ధి పనులు త్వరగా చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సుమారు పదేళ్లుగా ఈ రోడ్ల అభివృద్ధికి నోచుకోవడం లేదని గుంతల రోడ్లలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారని మండిపడుతున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా రోడ్ల పరిస్థితిలో మార్పు రావడంలేదు. గతంలో నిధులు మంజూరైనా రోడ్లు బాగుపడకపోగా.. ప్రస్తుత ప్రభుత్వం కూడా రోడ్ల అభివృద్ధిపై దృష్టి పెట్టడంలేదు. దీంతో ప్రజలు రోడ్ల విషయంలో తీవ్ర అసహనానికి గురవుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



మండలంలోని రోడ్లన్నీ గుంతలుగా మారాయి. రోడ్లపై గుంతలు ఏర్పడటంతో ఐదు నిమిషాల్లో వెళ్లే దూరానికి అరగంటకు పైగా సమయం పడుతోంది. అడుగడుగునా గుంతలు, కంకర తేలడంతో వాహనాలు చెడిపోతున్నాయి. రాత్రిపూట గుంతల్లో వాహనాలు బోల్తాపడి ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి.

– సంతోష్, సురంగల్, మొయినాబాద్

ప్రతిపాదనలు పంపుతున్నాం



మండలంలోని చాలా గ్రామాల రోడ్లు దెబ్బతిన్నాయి. అయితే గతంలోనే కొన్ని రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయి. చిలుకూరు–మొయినాబాద్ రోడ్డు పనులు మొదలయ్యాయి. కనకమామిడి–వెంకటాపూర్ రోడ్డు పనులు త్వరలోనే మొదలవుతాయి. మిగిలిన రోడ్లకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నాం.

– విజయ్‌కుమార్, పంచాయతీరాజ్ డిప్యూటీ డీఈ, మొయినాబాద్

అంబేడ్కర్‌ను అవమానపరచడం సరికాదు



షాద్‌నగర్: వెలిజర్లలో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

షాద్‌నగర్: మండల పరిధిలోని వెలిజర్ల గ్రామంలో అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవహేళన చేస్తూ మాట్లాడిన కేంద్ర మంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను శనివారం దహనం చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం సంఘం అధ్యక్షుడు తుప్పరి జంగయ్య, న్యాయవాది దొడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ.. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అంబేడ్కర్‌ను అవమానపరిచే విధంగా మాట్లాడటం సరికాదన్నారు. దేశ ప్రజల మనోభావాలు దెబ్బతినే విధంగా మాట్లాడిన అమిత్‌షాకు పదవిలో కొనసాగే నైతిక హక్కులేదన్నారు. కార్యక్రమంలో నాయకులు తుప్పరి శంకర్, తుప్పరి శ్రీశైలం, రాజు, శివకుమార్, యాదగిరి, రమేశ్, యాదయ్య, ప్రభు, భైండ్ల మల్లేశ్, జంగయ్య, వెంకటేశ్, రమేశ్, శ్రీకాంత్, దొడ్డి చందు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ క్షమాపణ చెప్పాలి

కొందుర్గు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వెంటనే క్షమాపణ చేయాలని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర నాయకుడు భిక్షపతి డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు శనివారం కొందుర్గు ముఖ్య కూడలిలో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం భిక్షపతి మాట్లాడుతూ.. 90 శాతం జనాభా ఉన్న ఎస్సీ, బీసీ, మైనార్టీల ఆరాధ్యదైవమని సంబోధించారు. అలాంటి అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో నాయకులు పెంటయ్య, రవీందర్, రాములు, విజయ్, అక్బర్, అశోక్, ఉదయ్, నర్సింలు, సందీప్ పాల్గొన్నారు.

ఘనంగా ఇరుముళ్ల పడిపూజ



మహాపడి పూజలో పాల్గొని అర్చకుడు రంగరాజన్, స్వాములు

మొయినాబాద్‌రూరల్: లోక కల్యాణం కోసం అవతరించిన హరహర పుత్రుడు అయ్యప్ప స్వామి దీవెనలతో సమస్త జీవకోటికి మేలు జరగాలని చిలుకూరు బాలాజీ దేవాలయం ప్రధాన అర్చకుడు సీ.ఎస్.రంగరాజన్ అన్నారు. శనివారం మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామంలో అయ్యప్ప స్వాములు ఇరుముళ్లు, మహాపడి పూజను ఘనంగా నిర్వహించారు. ఈ మహాపడి పూజలో సీ.ఎస్.రంగరాజన్ పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికి దైవభక్తితో పాటు దేశభక్తి ఉండాలన్నారు. ఆధ్యాత్మిక చింతన మానవుడికి ఎంతో అవసరమన్నారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన అయ్యప్ప మహాపడి పూజలో 18 మెట్లపై కర్పూర హారతిని వెలిగించారు. కార్యక్రమంలో పవన్‌కుమార్, గౌడ సంఘం మండల అధ్యక్షుడు అంజయ్యగౌడ్, సుదర్శన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బాలరాజ్, జ్ఞానేశ్వర్, విష్ణువర్ధన్‌రెడ్డి, గ్రామస్తులు, భక్తులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేవరకు పోరాటం

జీపీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి



ఎంపీడీఓకు సమ్మెనోటీస్ ఇస్తున్న నాయకులు, కార్మికులు

కొందుర్గు: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు వెళ్తామని జీపీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి అన్నారు. శనివారం ఎంపీడీఓ అనురాధతో పాటు జిల్లేడ్ చౌదరిగూడ ఎంపీఓ హన్మంతురెడ్డికి గ్రామ పంచాయతీ వర్కర్లు సమ్మెనోటీసు అందజేశారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. జీపీ వర్కర్లకు సంబంధించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలపై చాలాకాలంగా పోరాటం చేస్తున్నామన్నారు. అయినా అధికారులు, పాలకులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు సిద్ధమవుతున్నామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య, నాయకులు రాములు, శ్రీను, రమేశ్, నర్సింహ, జంగయ్య, కృష్ణ, కార్మికులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మధుసూదన్‌రెడ్డి



పూజలో పాల్గొన్న మధుసూదన్‌రెడ్డి, నాయకులు

షాబాద్: ఆధ్యాత్మిక చింతనతోనే ప్రతీ ఒక్కరికి మానసిక ప్రశాంతత లభిస్తుందని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని ఎర్రోనిగూడ గ్రామంలో శ్రీఅభయాంజనేయ స్వామి దేవాలయంలో నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపన, 7వ వార్షికోత్సవం సందర్భంగా యజ్ఞహోమాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, గుండాల అశోక్, మద్దూరు పాండు, మాజీ సర్పంచ్‌లు బండ మహేందర్‌గౌడ్, నాయకులు తదితరులు ఉన్నారు.

ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటాం

ఆపదలో ఉన్న ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని తిమ్మారెడ్డిగూడ గ్రామంలో గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చిన షాబాద్ సహకార సంఘం చైర్మన్ మద్దూరు మల్లేశ్‌ను ఆయన పరామర్శించారు.

ఉత్సాహంగా ఫుడ్ ఫెస్టివల్



షాద్‌నగర్: పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫుడ్‌స్టాల్స్



విద్యార్థులు తీసుకొచ్చిన వంటలను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

షాద్‌నగర్: మండల పరిధిలోని దూసకల్ గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం తల్లిదండ్రుల సమావేశంతో పాటుగా ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉత్సాహంగా వివిధ రకాల రుచికరమైన, పౌష్టిక విలువలతో కూడిన ఆహారాన్ని ఇంటి వద్ద తయారు చేసుకొచ్చి పాఠశాలలో ఏర్పాటు చేసిన స్టాళ్లలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా నాయకులు, అధికారులు స్టాళ్లను పరిశీలించి విద్యార్థులు తీసుకొచ్చిన ఆహార పదార్థాలను రుచిచూశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు సురేందర్‌రెడ్డి, రేవతి, డాక్టర్ శ్వేత, పంచాయతీ కార్యదర్శి ఆరాధన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

మొయినాబాద్‌రూరల్: విద్యార్థులు పౌష్టికాహారంతోనే ఆరోగ్యంగా ఉంటారని మండల విశ్వకర్మ గౌరవ అధ్యక్షుడు నర్సింహాచారి, హెచ్‌ఎం రేణుక పేర్కొన్నారు. శనివారం అమ్డాపూర్ పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన సమతుల్య ఆహార పదార్థాలను పరిశీలించి, వంటకాలను రుచి చూశారు. ఉపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి, రాంచందర్, శోభారాణి, మహేశ్వరి, జ్యోతి, సౌభాగ్యలక్ష్మి, అలివేలుమంగ, ఖాదర్, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం చౌదరిగూడ ఉన్నత పాఠశాలలో శనివారం ఫుడ్ ఫెస్టివెల్‌ను నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం సునిత ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులు వివిధ రకాల వంటకాలను సిద్ధం చేసి విద్యార్థులు అందరు కలిసి వంటకాలను రుచిచూశారు. కార్యక్రమంలో నాయకులు ఎజాజ్ అలీ, రజిత, నర్సింలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సుల ప్రమాదాలపై ఫిర్యాదు

చేవెళ్ల: ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయటంలో ఉన్న శ్రద్ధ విద్యార్థులను తీసుకొచ్చే బస్సులపై లేదని ఎస్‌ఎఫ్‌ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, అరుణ్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆర్డీఓ చంద్రకళ, ఎంఈఓ పురన్‌దాస్‌లకు ఫిర్యాదు చేశారు. ఇటీవల సిల్వర్ డేల్ స్కూల్‌కు సంబంధించిన బస్సులకు వరుస ప్రమాదాలు చోటు చేసుకొని తృటిలో విద్యార్థులు ప్రమాదాల నుంచి తప్పించుకున్నారన్నారు. అదే ఏదైనా పెద్ద ప్రమాదం జరిగితే విద్యార్థుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. మరోసారి ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేలా పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. బస్సుల ఫిట్‌నెస్, డ్రైవర్ల నియామకంపై ఆర్టీఏ అధికారులు తనిఖీలు చేయాలని కోరారు.



రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ, యూటీఎఫ్ నాయకులు

షాద్‌నగర్‌రూరల్: నల్గొండ పట్టణంలో నిర్వహించనున్న రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్ యూటీఎఫ్) రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి నర్సింలుగౌడ్ కోరారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నర్సింలుగౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నల్గొండ పట్టణంలో ఈ నెల 28, 29, 30న నిర్వహించే టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేసేందుకు నాయకులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బన్సీలాల్, ఎంఈఓ మనోహర్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి బిజిలి సత్యం, ఉపాధ్యక్షురాలు లక్ష్మీదేవమ్మ, నాయకులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం

మంచాల: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేసి తీరుతామని రాష్ట్ర నాయకుడు కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు గుండమోని జయమ్మ పేర్కొన్నారు. శనివారం మంచాల మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పదేళ్లకాలంలో బీఆర్‌ఎస్ ధనిక రాష్ట్రాన్ని దివాళా రాష్ట్రంగా మార్చిందని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో అవినీతికి తావులేదని, ఎవరైనా అవినీతి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మంచాల మండల పార్టీ ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సాతిరి ఎల్లేశ్, కొర్ర పాండులను శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వింజమూరి రాంరెడ్డి పాల్గొన్నారు.

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, కార్మికులు

షాద్‌నగర్: ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు డిమాండ్ చేశారు. శనివారం ఆటో కార్మికులు సీఐటీయూ నాయకులతో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎంతో మంది పేదలు రవాణా రంగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతో చాలా మంది యువకులు ఆటోలను నడిపిస్తున్నారని, వా రి అభివృద్ధికి ప్రభుత్వం ఎలాంటి సంక్షేమ పథకా లు ప్రవేశపెట్టలేదన్నారు. ఆటో కార్మికులపై ట్రాఫిక్ పోలీసులు, రవాణాశాఖ అధికారులు విపరీతమైన పెనాల్టీలు వేస్తున్నారన్నారు. ప్రభుత్వం త్రీవీలర్ ఆటోలకు స్థానికంగా రిజిస్ట్రేషన్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. చేనేత, బీడీ, గీత కార్మికులకు ఇస్తున్నట్లు ఆటో కార్మికులకు కూడ జీవన భృతి కింద ప్రభుత్వం రూ.4500 చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, ప్రమా ద బీమా కింద రూ.5లక్షలు, ఆరోగ్యశ్రీ కింద రూ.10లక్షల ఉచిత వైద్యాన్ని అందించాలన్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే విధంగా తగిన చర్యలను తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో నాయకులు కావలి రాజు, అయూబ్, సికిందర్, శ్రీశైలం, మన్నె చిన్నయ్య, భాస్కర్,మహేశ్, సాయి, కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా గణిత దినోత్సవం

గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని జాతీయ గణిత దినోత్సవాన్ని చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు గణితంపై పలు రకాల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. రామానుజన్ గణితంలో ఎన్నో సూత్రాలను కనుగొన్నారని, విద్యార్థులందరూ ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలకు చేరాలని పలువురు ఆకాంక్షించారు.



చేవెళ్ల: ఆలూరు పాఠశాలలో రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



శంకర్‌పల్లి: గణిత దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ట్రైనీ ఎస్‌ఐ, ఉపాధ్యాయులు, విద్యార్థులు



మొయినాబాద్‌రూరల్: ప్రదర్శనలను వీక్షిస్తున్న ఎంపీడీఓ సంధ్య, ఎంఈఓ వెంకటయ్య



కొందుర్గు: పాఠశాలలో విద్యార్థుల ప్రదర్శనను తిలకిస్తున్న ఉపాధ్యాయులు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
జి. మల్లికార్జున్
9505507564